## క్లుప్తంగా

### చిన్నారులకు పౌష్టికాహారం కిట్ల పంపిణీ



గుంటూరు మెడికల్: స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు వచ్చి చిన్నారులకు పౌష్టికాహారం, భోజన సదుపాయం కల్పించడం అభినందనీయమని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి శుశ్రుత హాలులో శనివారం ప్రాణాంతకమైన వ్యాధికి గురైన చిన్నారులకు, తల్లిదండ్రులకు పౌష్టికహారం కిట్లను ఏఆర్‌టీ సెంటర్ ఆధ్వర్యంలో ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ సమాజ సేవ చేయడం కూడా అదృష్టంగా భావించాలని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, డాక్టర్ రవి, సత్యనారాయణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### నిత్యం నవ్వుతో నూతనోత్సాహం



గుంటూరు వెస్ట్ (క్రీడలు): నవ్వడం ఒక యోగం, నవ్వించడం ఒక కళ, నవ్వకపోవడం రోగమని లాఫింగ్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ లాల్‌వజీర్ తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో శనివారం లాఫింగ్ క్లబ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వజీర్ మాట్లాడుతూ 2007లో ఈ క్లబ్ ఏర్పాటు చేశామని, కులమతాలకు అతీతంగా అందరూ కుటుంబ సభ్యులుగా ఉంటారని చెప్పారు. క్లబ్‌లో క్రీడా పోటీలతో పాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్లబ్ సభ్యులు నిత్యం వచ్చి తమ బాధల్ని మరచి సంతోషంగా నవ్వుకుంటారని పేర్కొన్నారు. నవ్వుతో నూతనోత్సాహం కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ధర్మం కిశోరి, లక్ష్మి, కమల, సంధ్య, కల్పన, వీరరత్నం ఖాదర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### నేడు ఎస్‌హెచ్‌వోలో ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: డయాబెటిక్ నిరోధక మాసం సందర్భంగా సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ (ఎస్‌హెచ్‌ఓ), మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు 'మెదడు, నరముల వ్యాధుల ఉచిత వైద్య శిబిరం, శాస్త్రీయ అవగాహన సభ' నిర్వహిస్తున్నట్లు సంస్థల అధ్యక్షులు డాక్టర్ తాతా సేవకుమార్, పావులూరి రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరులోని 2/1 బ్రాడీపేటలో గల ఎస్‌హెచ్‌వో బిల్డింగ్‌లో నిర్వహించే వైద్య శిబిరంలో వైద్య నిపుణుడు డాక్టర్ నటరాజ పాల్గొంటారని పేర్కొన్నారు. నగర ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు.

### 29న మహా కుంభాభిషేకం

పొన్నూరు: పట్టణంలోని శ్రీ సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత శ్రీ సాక్షి భావనారాయణస్వామి అష్టబంధన మహా కుంభాభిషేకాన్ని ఈ నెల 27 నుంచి 29 వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ధర్మకర్తల మండలి సభ్యురాలు కిలారి లక్ష్మీ సరస్వతి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో శనివారం కార్యక్రమాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మీ సరస్వతి మాట్లాడుతూ 27న ఉదయం 9 గంటలకు విష్వక్సేన ఆరాధనతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ప్రతిరోజు ప్రత్యేక పూజలు, హోమాలు జరుగుతాయన్నారు. 29న ఉదయం 9.05 గంటలకు మహా కుంభాభిషేకం జరుగుతుందని తెలిపారు. స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సభ్యులు పల్లికల శ్యామ్, మంద్రు అనిత, అర్చకులు రఘునాథబాబు, పులిపాక ప్రసాద్, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### గాజాపై ఇజ్రాయెల్ దాడులు అమానుషం

పెదకాకాని: గాజాపై ఇజ్రాయెల్ దాడులు అమానుషమని సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ ఖండించారు. గాజాపై ఇజ్రాయిల్ దాడుల్ని ఖండిస్తూ శనివారం వామపక్షాల పిలుపు మేరకు పెదకాకానిలో నిరసన తెలిపారు. కార్యక్రమానికి గుంటూరు జిల్లా మహిళా సమైక్య కార్యదర్శి రెంటాల కుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ ఉగ్రవాదులు తమ పౌరుల్ని కిడ్నాప్ చేశారని వంకతో గాజాపై ఇజ్రాయెల్ దేశం జరుపుతున్న యుద్ధం దారుణమని తెలిపారు. నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ అమెరికా కనుసన్నల్లో ఇజ్రాయిల్ దాడులు చేయడం అమానుషమని పేర్కొన్నారు. అమాయక ప్రజల ప్రాణాల్ని బలిగొంటున్న యుద్ధాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. భారత ప్రభుత్వం కూడా గాజాకు అండగా నిలవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వామపక్షాల నాయకులు బుల్లా బాబూరావు, దర్శి లింగారావు, సీహెచ్. విజయలక్ష్మి, రామిశెట్టి శ్రీనివాసరావు, బుల్లా వీరయ్య, దుర్గం కోటేశ్వరరావు, సీపీఎం పెదకాకాని గ్రామ కార్యదర్శి కోటిపల్లి సత్యనారాయణ, బాబూరావు పాల్గొన్నారు.

# ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు

**కమిషనర్ కీర్తి చేకూరి**



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ఎన్నికల విధుల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్వో కీర్తి చేకూరి ఆదేశించారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో శనివారం ఎన్నికల విభాగ విధుల నిర్వహణపై ఏఈఆర్‌వోలు, సూపర్వైజరి అధికారులు, బీఎల్‌వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో బీఎల్వోలు ఇంటింటి సర్వేలో సేకరించిన ఫారాల్ని ఏఈఆర్‌వోలు, సూపర్వైజరి అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించిన తర్వాతే ఈఆర్వో లాగిన్‌కి పంపాలని ఆదేశించారు. ప్రతి అర్జీపై బీఎల్‌వో, సూపర్వైజరి అధికారులు సంతకం చేసి రిపోర్ట్ ఇవ్వాలని చెప్పారు. అర్జీలు ఆన్‌లైన్‌ను బీఎల్‌వోలంతా ఆదివారం నాటికి పూర్తి చేయాలని తెలిపారు. సూపర్వైజరి అధికారులు ఎన్నికల విధుల్లో పూర్తిస్థాయిలో ఉండాలని, బీఎల్‌వోలు సెలవులో ఉంటే వారి స్థానంలో ఇన్‌చార్జిలను నియమించాలని చెప్పారు. అనంతరం ప్రధాన కార్యాలయంలో ఓటర్ల హెల్ప్ డెస్క్, కంప్లైంట్లు, నమోదు రిజిస్టర్‌ని కమిషనర్ పరిశీలించారు. ఓటర్ల నుంచి వస్తున్న ఫిర్యాదులు లేదా ఇతర వివరాల కోసం వచ్చే కాల్స్‌ని పోలింగ్ బూత్‌ల వారీగా రిజిస్టర్‌లో నమోదు చేసి, ప్రతి రోజు సాయంత్రానికి తమకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ కె.లక్ష్మీ శివజ్యోతి, ఏఈఆర్‌వోలు, డెప్యూటీ కమిషనర్లు సీహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, డెప్యూటీ సిటీప్లానర్ కోటయ్య, మేనేజర్ శివన్నారాయణ, సూపరింటెండెంట్లు సాంబశివరావు, ప్రసాద్, పద్మ పాల్గొన్నారు.

**హరిత దీపావళి జరుపుకోవాలి: కమిషనర్**

నెహ్రూనగర్: నగర ప్రజలంతా హరిత దీపావళి జరుపుకుని, పర్యావరణ రక్షణలో భాగస్వాములు కావాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి శనివారం ఒక ప్రకటనలో సూచించారు. పెద్ద శబ్దాలతో క్రాకర్స్ కాల్చడం, ఘాటైన రసాయన పదార్థాలతో తయారు చేసిన టపాసుల్ని కాల్చడంతో పర్యావరణానికి ఎంతో నష్టం కలుగుతుందని తెలిపారు. శబ్ద, వాయు కాలుష్యంతో ప్రజలు ఇబ్బందికి గురవుతారని పేర్కొన్నారు. మట్టి ప్రమిదలతో దీపాలు వెలిగించడం, పర్యావరణానికి హాని చేయని టపాసులు కాల్చడం ద్వారా ప్రజారోగ్యానికి మేలు చేసిన వారమవుతామని సూచించారు. కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ కూడా స్వచ్ఛ దివాలి..శుభ దివాలి అని పిలుపునిచ్చిందని, అందులో భాగంగా నగర ప్రజలు ఎకో ఫ్రెండ్లీ టపాసులు కాల్చాలని ఆమె సూచించారు. టపాసులు కాల్చి రోడ్ల మీద, కాల్వల్లో వేయకుండా, ఇంటి వద్దకు వచ్చే ప్రజారోగ్య కార్మికులకు ఇవ్వాలని ఆమె కోరారు.

## చీకట్లను పారదోలే వెలుగుల పండుగ దీపావళి



నరకాసురుని బొమ్మతో విష్ణువర్ధన్, ప్రసాదరావు, కృష్ణవేణి, పద్మజ, ఉపాధ్యాయ బృందం

గుంటూరు ఎడ్యుకేషన్: చీకట్లను పారదోలి వెలుగులు ప్రసాదించే పండుగగా దీపావళిని ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ పేర్కొన్నారు. లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని పాఠశాలలో శనివారం ముందస్తు దీపావళి వేడుకల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ మాట్లాడుతూ దీపావళి రోజున లక్ష్మీదేవిని పూజించడం సత్సంప్రదాయమని తెలిపారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నరకాసురుని బొమ్మను చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దహనం చేశారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. పిల్లలకు జాగ్రత్తలు తెలియజేస్తూ బాణసంచా కాల్చాలని అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ సూచించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### నగర ప్రజలకు మేయర్ దీపావళి శుభాకాంక్షలు



నెహ్రూనగర్: నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగని ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు. టపాసులు కాల్చే సమయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసు కోవాలని ఆయన సూచించారు. పెద్దల పర్యవేక్షణలోనే చిన్నారులు కాల్చాలని ఆయన తెలిపారు.

### జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా శుభాకాంక్షలు



గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజలకు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. మంచిపై చెడు సాధించిన విజయానికి గుర్తుగా దీపావళి పండుగను జరుపుకోవడం సంప్రదాయంగా వస్తోందని, చీకట్లను పారదోలి వెలుగును ప్రసరింపచేయు పండుగగా పేర్కొన్నారు. సీఎం వై.ఎస్. జగన్ సంక్షేమ పాలనలో ప్రజలంతా సుఖసంతోషాలతో పండుగను జరుపుకోవాలని ఆమె ఆకాంక్షించారు.

## విద్యుత్ షాక్‌కు గురైన యువకుడు

- 12 ఆపరేషన్లు చేసి ప్రాణాలు కాపాడిన వైద్యులు
- విలేకరుల సమావేశంలో వెల్లడి



కోలుకున్న గోపీనాయక్‌తో డాక్టర్ సుమితాశంకర్, డాక్టర్ నిశాంత్ సాధనాల

గుంటూరు మెడికల్ :విద్యుత్ షాక్‌కు గురై ప్రాణాపాయ స్థితిలో ఉన్న యువకుడికి గుంటూరు వైద్యులు 12 ఆపరేషన్లు చేసి ప్రాణాలు కాపాడారు. శనివారం గుంటూరు అరండల్ పేటలోని అమేజ్ మెడ్ స్పా లేజర్ అండ్ కాస్మోటిక్ సర్జరీ సెంటర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ప్లాస్టిక్ సర్జరీ వైద్యులు డాక్టర్ సుమితా శంకర్, డాక్టర్ నిశాంత్ సాధనాల వివరాలు వెల్లడించారు. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం మరసపెంట గ్రామానికి చెందిన 28 ఏళ్ల మూడావత్ గోపీనాయక్ సెప్టెంబర్ 8న పొలంలో మోటార్‌కు విద్యుత్ సరఫరా రాకపోవటంతో విద్యుత్ స్తంభం ఎక్కాడు. విద్యుత్ షాక్ తగలటంతో తీవ్రగాయాలై కిందకు పడిపోయి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. అనంతరం నరసరావుపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో 10 రోజుల పాటు వైద్యం చేయించుకున్నాడు.ఆరోగ్య పరిస్థితిలో ఏ మాత్రం మార్పులేకపోయే సరికి గుంటూరు అమేజ్ మెడ్ స్పా లేజర్ అండ్ కాస్మోటిక్ సర్జరీ సెంటర్‌కు వచ్చారని డాక్టర్ సుమితా శంకర్, డాక్టర్ నిశాంత్ సాధనాల చెప్పారు. తమ వద్దకు వచ్చే సరికి గోపీనాయక్‌కు మెడ, తల, కాళ్లు, చేతులు విద్యుత్ షాక్‌వల్ల తీవ్రంగా కాలి లోపలి ఎముక సైతం కరిగిపోయినట్లు వెల్లడించారు. కాలిన గాయాలు తీవ్రంగా ఇన్‌ఫెక్షన్స్‌కు గురై యాంటీబయాటిక్స్ పనిచేయని స్థితిలో తాము చికిత్స ప్రారంభించామని తెలిపారు. ఆస్పత్రిలో చేరిన నాటి నుంచి ప్రతి మూడు రోజులకు ఒకసారి చొప్పున డెబ్రయిడ్‌మెంట్, ఫ్లాప్ కవర్, నర్వటెండన్, జాయింట్ రీకన్‌స్ట్రక్షన్ మైక్రోసర్జరీలు 12 చేసి ప్రాణాలు కాపాడామని వివరించారు. బాధితుడు కోలుకోవటంతో శనివారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేస్తున్నామని వైద్యులు వెల్లడించారు.

### ఎస్‌కేబీఎం హైస్కూల్లో పూర్వ విద్యార్థుల సందడి



గుంటూరు ఎడ్యుకేషన్: ఏటీ అగ్రహారంలోని ఎస్‌కేబీఎం నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలో 1996-97 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల సమ్మేళనం శనివారం నిర్వహించారు. వాట్సాప్ గ్రూపు ద్వారా ఒక్కచోటకు చేరిన విద్యార్థులు నాటి మధుర స్మృతుల్ని గుర్తు చేసుకున్నారు. సహచర మిత్రుల్ని కలుసుకున్న ఆనందంలో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. నాడు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులు మోహనరావు, సుశీలాదేవి, సుహాసిని, సాంబిరెడ్డి, గోపాలరావు, శాంత కుమారి, ఎస్వీఎస్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థుల్ని కలుసుకున్న ఆనందంలో గురువులు సైతం ఆనంద పరవశులయ్యారు.

# టపాసులతో భద్రం సుమా..

- కాల్చే సమయంలో జాగ్రత్తలు తప్పనిసరి
- దీపావళిని ఆనందంగా జరుపుకోండి
- వైద్యనిపుణుల సూచన

గుంటూరు మెడికల్: చెడుపై మంచికి గెలుపు విజయానికి గుర్తుగా భారతదేశం అంతటా దీపావళి పండుగను జరుపుకుంటారు. దీపావళి పండుగ అనగానే అందరికీ గుర్తుకు వచ్చేవి టపాసులే... చిన్నవారు మొదలు పెద్దవారి వరకు అందరూ ఇష్టంగా.. కుటుంబ సమేతంగా టపాసులు కాల్చుతూ ఆనందాలను పంచుకుంటారు. రాత్రి వేళల్లో విద్యుత్ లేకపోయినా పండుగకు కాల్చే చిచ్చు బడ్డులు, కాకరపువ్వొత్తులు, మతాబుల, తారాజువ్వల వెలుగులతో నగరమంతా మిరుమిట్లు గొలిపే వెలుగు జిలుగులతో మెరిసిపోతుంది. వివిధ వలయాల ఆకారంలో ఆకాశంలో తారాజువ్వలు కాంతిని వెదజల్లుతూ ఉంటే ఆ దృశ్యం కనులకు ఎంతో రమణీయంగా ఉంటుంది. ఎంతో ఆనంద సంతోషాల మధ్య జరుపుకునే పండుగవేళల్లో ఏదైనా పొరపాటున ప్రమాదం జరిగితే అనగా మందు గుండు సామగ్రి చేతిలో పేలటం లాంటి చెడు సంఘటనలు జరిగితే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలపై 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

**జాగ్రత్తలు పాటించండి**

టపాసులు కాల్చే సమయంలో.. ముఖ్యంగా పేలుళ్ళు ఎక్కువగా ఉండే మందుగుండు సామగ్రి కాల్చేటప్పుడు సాధ్యమైనంత దూరంగా ఉండి వాటిని వెలిగించాలి. లేని పక్షంలో చెవికి సంబంధించిన సమస్యలు వచ్చే అవకాశం ఉంది. శబ్దం తక్కువగా ఉండే మందులను కాల్చడం ద్వారా ధ్వని కాలుష్యం కొద్ది మేరకు తగ్గే అవకాశం ఉంది. సీసాలు, లేదా డబ్బాల్లో పెట్టి తారాజువ్వలు వెలిగించడం ద్వారా చేతులకు హాని జరగకుండా కాపాడుకోవచ్చు. సాధ్యమైనంత మేరకు దూరంగానే ఉండి టపాసులకు నిప్పు అంటించాలి. ఇనుప కడ్డీలతో కూడిన మందులను కాల్చినప్పుడు జాగ్రత్తగా వాటిని భద్రం చేయాలి. లేని పక్షంలో అవి కాళ్లకు గుచ్చుకునే ప్రమాదం ఉంది. కాల్చిన వెంటనే వాటిని నీటిలో వేయాలి.

### నిప్పురవ్వలతో కళ్లు జాగ్రత్త



కళ్లల్లో నిప్పురవ్వలు పడకుండా జాగ్రత్త పడాలి. కళ్లజోడు పెట్టుకోవడం చాలా మంచిది. ఏదైనా పొరపాటున కంట్లో రవ్వలు పడితే తక్షణమే వైద్యుల్ని సంప్రదించాలి. కంటిలో ఏదైనా పడితే సొంత వైద్యం చేయడం చాలా ప్రమాదకరం. ముఖ్యంగా కంటిలో నీటిని చల్లడం, నాలుక పెట్టి తొలగించడం వంటివి చేయడం చాలా అనర్థాలకు దారి తీస్తుంది. టపాసులు కాల్చే సమయంలో కాటన్, లూజుగా ఉండే వస్త్రాలు ధరించడం చాలా ఉత్తమం.

–డాక్టర్ జి.రవిబాబు,
కంటి వైద్య విభాగాధిపతి, గుంటూరుజీజీహెచ్

### చర్మం కాలితే జాగ్రత్తలు తీసుకోవాలి



టపాసులు కాల్చే సమయంలో చర్మానికి ఏదైనా కాలడం ద్వారా గాయం ఏర్పడితే తక్షణమే వైద్యులను సంప్రదించాలి. నిప్పురవ్వలు పడిన వెంటనే చల్లని నీటితో ఆ ప్రాంతంలో శుభ్రంగా కడగాలి. కాలిన గాయానికి గాలి ఆడేటట్లు చూడాలి. బర్నాల్ లేదా సల్ఫర్ డయాజిన్ కాలిన ప్రదేశంలో పూసి తక్షణమే వైద్యుడిని సంప్రదించాలి. అరచేతులు, అరికాళ్లు, ముక్కు, కన్ను, మర్మాంగాలు, పిరుదల మధ్య కాలిన గాయాలైతే ఏ మాత్రం అశ్రద్ధ చేయకుండా తక్షణమే వైద్యుడిని సంప్రదించాలి.

–డాక్టర్ మన్నె సింధూర,
చర్మవ్యాధుల నిపుణులు, గుంటూరు

### 14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు



పెదకాకాని: విద్యార్థులు, యువత గ్రంథాలయ వారోత్సవాల్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచి గోళ్ల స్వరూపరాణి తెలిపారు. పెదకాకాని గ్రంథాలయంలో శనివారం 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకుని వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వరూపరాణి మాట్లాడుతూ వారోత్సవాల సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల్లో విద్యార్థులు, యువత పాల్గొనడం ద్వారా జనరల్ నాలెడ్జ్‌పై అవగాహన పెరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ఈనెల 14 నుంచి 20 వరకు నిర్వహించే వారోత్సవాలలో పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. గ్రంథాలయాధికారి వేముల విజయ్‌కుమార్ మాట్లాడుతూ వారం రోజుల పాటు బాలల దినోత్సవం, దేశభక్తి గేయాల పోటీలు, పుస్తక ప్రదర్శన, కథలు చెప్పడం, పద్య పఠనం, గ్రంథాలయ ఉద్యమ ప్రముఖులు ఎస్సార్ రంగనాథన్, అయ్యంకి వెంకట రమణయ్య, పాతూరి నాగభూషణం వంటి వారిని స్మరించుకోవడం, వ్యాస రచన పోటీలు, కవి సమ్మేళనాలు, సెమినార్లు, రచయితల సందేశాలు, చిత్రలేఖనం పోటీలు, పుస్తక ప్రదర్శన, డిబేట్ పోటీలు, మహిళా దినోత్సవం, దిశా చట్టం, మహిళ సాధికారతపై చర్చ, క్రీడా పోటీల నిర్వహణతో పాటు డిజిటల్ గ్రంథాలయాలు, చదవటం మాకిష్టం కార్యక్రమంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. చివరి రోజు 20వ తేదీన విజేతలకు బహుమతుల ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల్ని ఆదుకుంటున్న సీఎం సహాయ నిధి

**ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా**



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: అనారోగ్యంతో బాధపడుతున్న పేదల్ని సీఎం సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) ఎంతగానో ఆదుకుంటోందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా చెప్పారు. బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం రూ. 9 లక్షల విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఐదుగురు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కనీసం పేదలకు మెరుగైన వైద్యం కూడా అందించలేదని, కాని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మెరుగైన వైద్యం అందించడంతోపాటు పేద రోగులకు సీఎంఆర్‌ఎఫ్ నిధులు అందజేస్తున్నారని తెలిపారు. ఇంటి వద్దకే వైద్యం అందిస్తున్న ఘనత సీఎం వై.ఎస్.జగన్‌కే దక్కుతోందని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రామనబోయిన అజయ్‌యాదవ్, మర్రి అంజలి, వైఎస్సార్ సీపీ నేత సత్యం పాల్గొన్నారు.

# దేశ విద్యా వ్యవస్థలో కలాం పాత్ర శ్లాఘనీయం



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలతో ఉర్దూ డీఐ ఖాసిం



అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నంబూరు సుభాని

గుంటూరు ఎడ్యుకేషన్: దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యా వ్యవస్థలో తనదైన ముద్ర వేశారని ఉర్దూ డీఐ షేక్ మొహ్మద్ ఖాసిం పేర్కొన్నారు. చౌత్రా సెంటర్లోని ఉర్దూ డీఐ కార్యాలయంలో శనివారం భారతరత్న డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఖాసిం మాట్లాడుతూ అబుల్ కలాం ఆజాద్ దేశ స్వాతంత్రోద్యమంలోనే కాకుండా స్వతంత్ర భారతదేశ విద్యా వ్యవస్థలో తనదైన స్థానాన్ని ఏర్పరచుకున్నారని తెలిపారు. ఆయన ప్రవేశపెట్టిన పలు సంస్కరణలు విద్యావ్యవస్థలో పెను మార్పుల్ని తెచ్చాయని చెప్పారు. ఉన్నత, సాంకేతిక విద్యలలో గణనీయమైన పురోభివృద్ధి కోసం మొదటి ఐఐటీని ఖరగపూర్‌లో స్థాపించారని గుర్తు చేశారు. బహు భాషా కోవిదుడైన ఆజాద్ మహిళా అక్షరాస్యత, నిర్బంధ ప్రాథమిక విద్య, అనియత విద్య, వయోజన విద్య మొదలైనవి ఆయన ఆలోచనల నుంచి ఉద్భవించినవే అని వివరించారు. కేంద్ర విద్యామంత్రిగా పని చేస్తున్నప్పుడు ఆయన జీతంలో చాలా తక్కువ మొత్తాన్ని తీసుకుని, మిగిలినది దేశ స్వాతంత్ర సమరంలో అసువులు బాసిన వారి వితంతువులకు ఇచ్చేవారని, సాధారణమైన జీవితం గడిపే వారని కొనియాడారు. ఆ మహనీయుని ఆశయాలకు అనుగుణంగా, ప్రజాస్వామ్యంలో నూరు శాతం అక్షరాస్యత సాధించినప్పుడే దేశం పురోభివృద్ధిలో సాధిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు ఆరిఫ్ బేగ్, అబ్దుల్ ఖయ్యూమ్, కరీముల్లా, మోహిద్దీన్, గౌస్ బాషా పాల్గొన్నారు.

**ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు అభినందన**

మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా శనివారం విజయవాడలో జరిగిన జాతీయ మైనార్టీ దినోత్సవంలో ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న పలువురు ఉపాధ్యాయుల్ని ఉర్దూ డీఐ షేక్ మొహ్మద్ ఖాసిం అభినందించారు. చౌత్రా సెంటర్లోని ఉర్దూ డీఐ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా తాడికొండ మండలం పొన్నెకల్లులోని మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఎండీ నజీర్ ఉర్దూ భాషకు అందించిన సేవలకు జీవన సాఫల్య అవార్డు, తాడేపల్లిలోని మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని మునిరా బేగం, తెనాలి మున్సిపాలిటీ ఎంఎంఎస్ పినపాడు మున్సిపల్ ఉర్దూ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని ఆయేషా రియాజ్, రైలుపేటలోని నగరపాలకసంస్థ ఉర్దూ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని షేక్ గుల్జార్ ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ అవార్డు పొందడం హర్షణీయమన్నారు. జీవన సాఫల్య అవార్డు అవార్డు పొందిన వారికి రూ.25వేలు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన వారికి రూ.10వేలు చొప్పున నగదు, జ్ఞాపికతో సత్కరించడం అభినందనీయని తెలిపారు.

**ఆంధ్ర ముస్లిం కళాశాలలో ఆజాద్ జయంతి**

పొన్నూరు రోడ్డులోని ఆంధ్ర ముస్లిం కళాశాలలో శనివారం భారతరత్న డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆజాద్ చిత్రపటానికి కళాశాల కరస్పాండెంట్ నంబూరు సుభాని పూల మాల వేసి నివాళులర్పించారు. తొలి విద్యా మంత్రిగా ఆయన సేవల్ని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు ఎంఏ రెహమాన్, సలహాదారుడు డాక్టర్ ఎండీ మస్తాన్ వలీ, డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ షాహీనాబేగం, షమీమ్ బేగం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### చంద్రమోహన్ మృతి కళా రంగానికి తీరని లోటు

పాత గుంటూరు: ప్రముఖ సినీ నటుడు చంద్రమోహన్ మృతి కళా రంగానికి తీరని లోటని కళా దర్బార్ అధ్యక్షుడు పొత్తూరి రంగారావు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఈ ఏడాది మేలో నిర్వహించిన కళాదర్బార్ వార్షికోత్సవంలో చంద్రమోహన్ దంపతులకు అవార్డులు అందించి ఘనంగా సత్కరించినట్లు తెలిపారు. చంద్రమోహన్ మృతి పట్ల కళారంగ ప్రముఖులు మిరియాల ప్రసాదరావు, మేకల పురుషోత్తమ ప్రసాద్, చిట్టినేని లక్ష్మీనారాయణ, సీతారామయ్య సంతాపం వ్యక్తం చేశారు.